మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అమలాపురం వేదిక

7



డ్రగ్స్ రహిత జిల్లా లక్ష్యంగా పోలీసుల విధులు

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య (డ్రగ్స్) రహిత జిల్లాగా కాకినాడ జిల్లాను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసుశాఖ అంకితభావం, పారదర్శకతతో విధులు నిర్వర్తిస్తోందని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో, సైకిల్ తొక్కు బ్రో అనే నినాదంతో ఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ లక్ష్యంగా ఈగల్ సంస్థను స్థాపించారన్నారు. ఇందులో చేపట్టిన కార్యక్రమాల్లో ఆపరేషన్ గరుడాలో హెచ్-1 షెడ్యూల్ డ్రగ్స్ అర్హుడైన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడదని హెచ్చరికలు జారీచేయడం, అనధికారికంగా ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ అమ్ముతున్నవారిపై కేసులు నమోదుచేసి షాపులను సీజ్ చేశామన్నారు. ఒడిసా నుంచి వచ్చే రైలుమార్గం ద్వారా జరుగుతున్న డ్రగ్స్, గంజాయి అక్రమరవాణాను అరికట్టేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరాయంగా జరుగుతున్నాయన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలోని షాపుల్లో తనిఖీలు చేపట్టి గుట్కాలు, తంబాకు, సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న నిర్వాహకులపై కోట్పా చట్టం 2003 ప్రకారం జరిమానాలు విధించడం జరిగిందన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ సెల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972, అలాగే 8977781972 వాట్సాప్ నెంబర్‌కుగాని తెలియజేయాలన్నారు. ఈ ర్యాలీ సర్పవరం పోలీస్ గెస్ట్‌హౌస్ నుంచి భానుగుడి కూడలి వరకు కొనసాగింది. కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, ఈగల్ విభాగ సీఐ పీవీ సూర్యమోహన్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పదిగంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన చేస్తూ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. అర్జీదారులు తమ అర్జీల పురోగతిని, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరుకు కాల్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. పీజీఆర్ ఎస్‌కు హాజరుకాలేని అర్జీదారులు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

దిత్వా గాలు!



చివరికిలా : గొల్లప్రోలులో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యపు రాశులు



మళ్లీ కష్టమే : పిఠాపురంలో నేలకొరిగిన వరి

భయపెడుతోన్న మరో తుఫాన్

- తీవ్ర ఆందోళనలో రైతాంగం
- 50 శాతమే ఒబ్బిడి అయిన పంట
- కళ్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం
- పంట కాపాడుకునేందుకు పరుగులు

పాపం అన్నదాత.. పండించే వరకే పంట అన్నదాత చేతుల్లో ఉంటుంది.. పండించిన తర్వాత ప్రకృతి చేతుల్లో ఉంటుంది.. ప్రకృతి కరుణిస్తే పంట చేతికొస్తోంది.. లేదంటే ప్రకృతిలో కలిసిపోతోంది.. ఆరుగాలం కష్టించిన అన్నదాతను ఇలా నష్టాల పాలు చేస్తోంది.. మొన్న మొంథా... ఆ కష్టం నుంచి అన్నదాత ఇంకనూ తేరుకోలేదు.. ఇంకా పడుతూ లేస్తూనే ఉన్నాడు.. చివరికి ఏదో ఒక విధంగా బయటపడదామనుకుంటుంటే మళ్లీ 'దిత్వా' తుఫాన్ వచ్చిపడింది.. ఎటు నుంచి ఏ కష్టం వస్తుందోనని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.. ఉన్న పంటను కాపాడుకునే పనిలో పడ్డాడు.. పంటను విక్రయించేసిన వాళ్లు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంటుంటే కళ్లాలపై ఉన్న వాళ్లు మాత్రం ఏం జరుగుతుందోననే దిగాలులో ఉన్నారు.. ఆదివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో మరో ప్రమాదం నుంచి బయటపడేందుకు సన్నద్ధమవుతున్నారు. మరో వైపు సముద్రంలోనూ ఈదురుగాలులు వీస్తున్నాయి.. దీంతో ప్రజల్లో అలజడి నెలకొంది..



లోడు క్యూ : ధాన్యం విక్రయాలకు ఇలా

(పిఠాపురం/గొల్లప్రోలు/పి.గన్నవరం/రాజమహేంద్రవరం/సామర్లకోట - ఆంధ్రజ్యోతి)

పంట చేతికందే వేళ వరుస తుఫాన్ హెచ్చరికలు, మారుతున్న వాతావరణం రైతులను కలవరానికి గురిచేస్తోంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, మబ్బులతో కూడిన వాతావరణం, సాయంత్రం చిరుజల్లులతో రైతులు తమ ధాన్యాన్ని మిల్లులు చేర్చే వరకు భయంభయంగా ఆకాశం వైపు చూస్తూ కాలం గడిపారు. ధాన్యం తడవకుండా చూసుకునేందుకు రైతులు పాట్లు పడ్డారు. ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరాయి.

పెరిగిన చలి తీవ్రత

తుఫాన్ ప్రభావమో ఏమిటో కానీ ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి.. భానుడు మబ్బుల మాటున దాక్కునే ఉన్నాడు. ఉదయం నుంచి జనం తట్టుకోలేనంతగా చలి తీవ్రత ఉంది. రాత్రయినా వాతావరణంలో మార్పుకానరాలేదు. పెద్దలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మంకీ క్యాప్‌లు, స్వెటర్లు వేసుకుని తిరిగారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మారిన వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం వాతావరణం మారిపోయింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. పగటిపూటే చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాతానికి పైగా విస్తీర్ణంలో వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. మిగిలిన పంట పొలాల్లోనే ఉంది. కోతలు, నూర్పుళ్లు వేగంగా జరుగుతున్న తరుణంలో దిత్వా తుఫాన్ హెచ్చరికతో ఆదివారం రైతులు వ్యవసాయ పనులు నిలిపివేశారు. ధాన్యం తడవకుండా పరుగులు పెట్టారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుని బరకాలు,టార్పాలిన్లు కప్పారు. వరి కుప్పల్లోకి నీరు చేరకుండా బరకాలు కప్పారు. మరో వైపు మిల్లుల వద్ద ఉన్న లారీలు, ట్రాక్టర్లల్లో ధాన్యం బస్తాలు తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో వైపు గాలుల ప్రభావంతో వరి పంట నేలవాలింది.రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన పంట నేలనంటడంతో గింజ రాలే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాబజార్..

వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యంలో ఎక్కువ శాతాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారు. దళారులు, వ్యాపారుల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. తేమ శాతం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇప్పుడు తుఫాన్‌తో వాతావరణం మారడంతో ఇదే అదనుగా ధాన్యాన్ని తక్కువ కొనేందుకు ప్రయత్నిస్తున్నారు.రెండు రోజుల వ్యవధిలో ధాన్యం బస్తాను రూ.75 నుంచి రూ.125 వరకూ తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన ధరకు అమ్మకుంటే ధాన్యం వర్షానికి తడిస్తే నష్టం మరింత అధికంగా ఉంటుందని భావించి వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు.

'మొంథా' మరువక ముందే...

ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వరిచేలు నేలనంటాయి. దిగుబడి గణనీయంగా తగ్గి నష్టం వాటిల్లింది. ప్రస్తుత తుఫాన్ ప్రభావం మాసూలు చేసుకుంటున్న రైతులపై పడింది. ఎక్కువశాతం రైతులు యాంత్రీకరణ ద్వారానే తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నప్పటికీ వాతావరణం కరుణించకపోతే యంత్రాలు తిరిగే పరిస్థితి ఉండదు. ఒబ్బిడి చేసుకున్న ధాన్యం కనీసం ఒక్కరోజైనా ఎండబెట్టకపోతే తేమశాతం మిల్లర్లు సూచించిన స్థాయికి రాదు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు, మాసూళ్లు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వేచి చూడాలంటున్నారు. ధాన్యం రాశులు తడవకుండా, కుప్పల్లోకి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



ఉప్పాడ తీరంలో అలల ఉధృతి ఇలా..

తీరాన అలజడి

కొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రం నీటిమట్టం పెరగడంతోపాటు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ ఉప్పాడ శివారు కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన బండరాళ్లను తాకుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచీ తీరంలో ఈదురు గాలులు వీచడంతో సముద్రంలోకి వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకొన్నారు.

తూర్పున ఇలా..

ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో సాగు చేయగా 62,712 హెక్టార్లలో కోతలు పూర్త య్యాయి. ప్రస్తుతం కోతలు ఆపేశారు. కళ్లాల్లో సుమారు 30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యం కాగా ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించింది.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 1,67,406 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1,08,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఈస్ట్రన్ డెల్టాలో ముందుగా కోతలు మొదలైనప్పటికీ మొంథా తుఫాన్ ప్రభావంతో స్వర్ణ రకం ఎక్కువ శాతం నేలనంటడంతో పాటు కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.ఈస్ట్రన్ డెల్టాలో ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో, సెంట్రల్ డెల్టాలో 28 వేల ఎకరాల వరకు కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

కాకినాడలో ఇలా..

కాకినాడ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన తాళ్లరేవు, కరప, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం, కోట నందూరు, ఏలేశ్వరం మండలాల్లో మాత్రమే కోతలు ఇంకా మిగిలి ఉన్నాయి. 40 వేల మంది రైతుల సెల్‌ఫోన్లకు వాతావరణ సమాచారాన్ని అందించి జాగ్రత్తలను వివరించాం. డెల్టా ప్రాంత మండలాల్లో 75 శాతం పంటకోతలు పూర్తయ్యాయి. పంట కోతలను ప్రస్తుతానికి ఆపి వేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశించారు.



పాడా పీడీగా శ్రీనివాసరావు

బాధ్యతల స్వీకరణ

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికారిక సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పాడా పీడీగా పనిచేసిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ చైత్రవర్షిణి గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలో మైక్రో క్రెడిట్ స్పెషల్ ఆఫీసరుగా బదిలీ అయ్యారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న శ్రీనివాసరావుకు పాడా పీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. కాగా పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను డిసెంబరు 1వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పీజీఆర్ఎస్ జరుగుతుందని, ప్రజలు తమ అర్జీలను అందించవచ్చని చెప్పారు.

తుని ఏరియా సిబ్బందిపై

సస్పెన్షన్ వేటు

సర్జికల్ బ్లేడ్ లోపలే ఉంచి శస్త్రచికిత్స చేసిన వైద్యుడు, స్టాఫ్ నర్సుపై చర్యలు

ఘటనపై వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సీరియస్

శస్త్ర చికిత్స సమయంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినట్టు విచారణలో వెల్లడి

7

ఇక నుంచి రేషన్ దుకాణాల్లో టీ పొడి విక్రయాలు

- తొలుత కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో అమలు
- మినీమాల్స్‌గా రూపుదిద్దుకోనున్న రేషన్ దుకాణాలు
- కూటమి ప్రభుత్వంలో పేదలకు తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రేషన్ దుకాణాలలో టీపొడి విక్రయాలు చేయనున్నారు. దీనికి ప్రభుత్వం సర్వం సిద్ధంచేస్తోంది. తొలుత కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో టీ పొడిని విక్రయించాలని నిర్ణయించారు. 20 గ్రాముల ప్యాకెట్ రూ.10, 40 గ్రాముల ప్యాకెట్‌ను రూ.20కు అమ్మకాలు చేసేవిధంగా ధరలు నిర్ణయించారు. కాకినాడ జిల్లాలో 617 రేషన్ దుకాణాలలో, తూర్పుగోదావరి జిల్లాలో 472 రేషన్ దుకాణాలలో తొలుత టీ పొడిని విక్రయించేందుకు గుర్తించారు. రేషన్ డీలర్లకు బియ్యం, పంచదార విక్రయిస్తే వచ్చే కమిషన్‌తోపాటు ఇక నుంచి టీపొడి అమ్మకాల ద్వారా కూడా 14 శాతం మార్జిన్ వస్తుంది. టీ పొడి అమ్మకాలు చేసే రేషన్ డీలర్లు రూ.5 వేల చొప్పున డీడీలు తీయాలని అధికారులు సూచించారు. అయితే రేషన్ డీలర్లు మాత్రం తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని టీ పొడిని అరువుపై ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కోరుతున్నారు. అలా ఇస్తే టీ పొడి విక్రయించిన తర్వాత సొమ్ములు ప్రభుత్వానికి జమ చేస్తామంటున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రేషన్ దుకాణాలను మినీమాల్స్‌గా తయారుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. తొలిదశలో టీ పొడి ఏర్పాటుచేసిన తర్వాత నూనెలు, అన్ని రకాల పప్పులు, గోధుమ పిండి, చక్కెర, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి అన్ని రకాల నిత్యావసర వస్తువులు విక్రయాలకు ఏర్పాటు చేయనున్నారు. రేషన్‌కార్డుదారులు సూపర్ మార్కెట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ ఇక్కడే తక్కువ ధరలకు లభించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుతో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారిణి శైలజాకుమారి (ఫైల్‌ఫొటో)

ఆయిల్‌పామ్‌తో సాగుకు వంద శాతం రాయితీలు

ఉద్యానవనశాఖాధికారి శైలజాకుమారి

సామర్లకోట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందిస్తోందని పెద్దాపురం డివిజన్ ఉద్యానవనశాఖాధికారిణి శైలజాకుమారి చెప్పారు. సామర్లకోట మండలంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ సాగును పరిశీలించేందుకు, ఈ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు వివరించేందుకు ఇటీవల హెచ్‌వో శైలజాకుమారి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 29 వేల హెక్టార్లలో సాగవుతుండగా సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో 6,966 హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. మొక్కల కొనుగోలు, ఎరువులు, అంతర పంటల సాగుతోపాటు మార్కెట్ సదుపాయం వరకూ ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ముఖ్యంగా మొక్కలు వందశాతం రాయితీతో అందించడం వల్ల రైతులు అధిక శాతం ఆయిల్‌పామ్ సాగుపట్ల ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. హెక్టారుకు త్రికోణాకార పద్ధతిలో నాటుకోవాల్సిఉంటుందని హెక్టారుకు 143 మొక్కలు కావాల్సిఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ మొదటి కాపు ఎకరానికి దాదాపు 3 నుంచి 4 టన్నుల మేర గెలల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఎనిమిదేళ్ల వయస్సు ఉన్న తోటల్లో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల మేర గెలల దిగుబడి వస్తుందన్నారు. జిల్లాలో రైతులకు మొక్కలు అందిస్తున్న సంస్థలే పండిన గెలలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందన్నారు. గతంలో టన్ను గెలలకు రూ.14 వేలు చెల్లించగా ప్రస్తుతం రూ.17 వేల చొప్పున ధర పలుకుతున్నట్టు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతుకు రూ.71 వేల చొప్పున రాయితీ అందిస్తోందన్నారు. అంతేకాకుండా యాంత్రీకరణ, నీటి వసతి పరికరాలకు రూ.20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకూ రాయితీ ఇస్తోందన్నారు. మొదటి మూడు సంవత్సరాలు ఆయిల్‌పామ్ మొక్కలు పెంచేందుకు సమయం పడుతుందన్నారు. భూసారం, మొక్క ఎదుగుదలను బట్టి నాల్గవ సంవత్సరం నుంచే గెలల దిగుబడి చేతికందే అవకాశాలు ఉంటాయన్నారు. హెక్టారుకు మూడేళ్లపాటు ఇచ్చే రాయితీల్లో ఏడాదికి రూ.5,250 చొప్పున చెల్లిస్తారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆయిల్‌పామ్ సాగు ద్వారా పొందవచ్చని శైలజాకుమారి వివరించారు.

కన్నేసి.. కొట్టేసి..

- ఆందోళన కలిగిస్తోన్న బైక్ చోరీలు
- ఇటీవల కాలంలో పెరిగిన బాధితులు
- కలవరపెడుతున్న అపరిచితుల జాడ
- నగర పరిసర ప్రాంతాల్లో సంచారం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రజల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రత్యేక తనిఖీలతో ఊళ్లను సైతం జల్లెడపడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా తనిఖీలు అధికంగా కనిపిస్తున్నాయి. సర్కిల్, స్టేషన్ల పరిధిలోని చేపడుతున్న ఈ తనిఖీలతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతున్నా.. పలు విషయాల్లో మాత్రం ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రధానంగా బైక్ దొంగతనాలు, అపరిచిత వ్యక్తుల కదలికలు ప్రజలను కలవరపెడుతున్నాయి. ప్రాంతమేదైనా.. పార్క్ చేసిన బైక్‌లను ఎత్తుకుపోతున్నారు. జనసమర్థ ప్రాంతాల్లోనే ఈ దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, జీజీహెచ్, జేఎన్‌టీయూ కళాశాల, వివేకానంద పార్కు ఇలా పలు ప్రాంతాల్లో ఈ దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ బైక్ దొంగతనాలకు సంబంధించి నిత్యం ఏదో ఒక చోట ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే కాకినాడ చుట్టుపక్కల, పోర్టు, బీచ్ తదితర ప్రాంతాల్లో భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాకినాడలో అపరిచితుల కదలికలు పెద్దఎత్తున పెరిగాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చేవారి సంఖ్య అధికమైంది. పోర్టుతోపాటు సముద్రతీరానికి సమీపంలో ఉన్న కర్మాగారాల్లో పనిచేసేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. వీరందరూ నగర శివారు ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఊర్ల చివరన నివాసాలు అద్దెకు తీసుకుంటున్నారు. పోర్టు ఇతర షిప్పింగ్ కంపెనీలు, మిల్లులు, గోదాములు, ఆయిల్ కంపెనీలు, రొయ్యల కంపెనీలు, టైల్స్ ఫ్యాక్టరీలు ఇతరత్రా కర్మాగారాల్లో కూలీలుగా చేరి కాలం వెళ్లదీస్తున్నారు. అయితే వీరు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎవరు తీసుకొచ్చారు? వీరికి నేర చరిత్ర ఏమైనా ఉందా? వంటి వివరాలు ఆరా తీసే వారే లేరు. ఈ క్రమంలో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు జిల్లాను జల్లెడపడుతున్నా.. చోరీలు పూర్తిగా అదుపులోకి రాలేదనిపిస్తోంది. ఇటీవల జిల్లాలో పలుచోట్ల పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. సామర్లకోట అమ్మాణమ్మ అపార్ట్‌మెంట్ వద్ద నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో నంబర్లు లేని 11 వాహనాలను సీజ్ చేశారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఏలేశ్వరం మండలం దిబ్బలపాలెం పరిసరాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని 45 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలో పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో డెయిరీఫాం సెంటర్, దుమ్ములపేట ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 20 వాహనాలను సీజ్ చేశారు. అలాగే కచేరీపేట, పాతబస్టాండ్ సెంటర్ ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి రికార్డులు లేని వందకు పైగా వాహనాలను గుర్తించారు. కాగా పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా పోలీసుస్టేషన్లకు తెలియజేయాలని పోలీసులు నోటీసులు పంపిస్తున్నారు. ఉద్యోగుల సమాచారం ఒక ఫైల్ రిజిస్టర్ రూపంలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.



ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేస్తున్న దృశ్యం

కాకినాడలో కార్డన్ సెర్చ్




వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ

కాకినాడ క్రైం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అంతర్గత భద్రతపై ప్రజలను అప్రమత్తం చేసే దిశగా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలమేరకు కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ సత్యనారాయణ అయోధ్యనగర్, ఉప్పరపాకల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి రికార్డులు లేని 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్సైలు, త్రీటౌన్, టూటౌన్, పోర్ట్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15 కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి ఆదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టి పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు..... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్టూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్ళలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీపీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా ఆరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు
వెబ్‌సైట్: https://bdl-india.in

భారత డాయనామిక్స లిమిటెడ
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.
ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4
అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.
ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా
దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)
వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు


బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది
పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9
వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

చిత్రజ్యోతి
SINCE 1965

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పొలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అఖండ నుంచి అవతార్ వరకూ...

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్



ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ్' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా



'**బా**లకృష్ణ గారి లాంటి లెజండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచనలాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ



తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాలకుపైగా నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్ఎక్స్ ప్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?

అదూర్ గోపాలకృష్ణన్



ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

ఉల్లాసం... ఉత్సాహం!

రాజమహేంద్రవరంలో ముగిసిన గోదావరి బాలోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన దృశ్యాలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో 2రోజులపాటు జరిగిన గోదావరి బాలోత్సవం ఆదివారంతో ముగిసింది. చిన్నారులు క్లాసికల్ డ్యాన్సు, సైన్సు ప్రయోగాలు, గణిత పజిల్స్, జానపద నృత్యాలు, కోలాటం, లఘునాటికలు, జానపద గీతాలాపన, చిత్రలేఖనం తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఏ.విశ్వేశ్వరరావు, ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, అపుస్మా జిల్లా కార్యదర్శి పి.కల్యాణ్‌రెడ్డి, ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు మనవడు డెన్నిస్ దామెర్ల, ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి టి.క్రాంతికుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, ప్రధాన కార్యదర్శి డి.సాయిబాబా, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

శుభ ముహూర్తం ఖరారు...

జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2 వరకు అంతర్వేదిలో వార్షిక కల్యాణోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక దివ్య, తిరు కల్యాణ మహోత్సవాలకు శుభ ముహూర్తం ఖరారైంది. తొలుత అర్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు ముహూర్తపు పత్రికను ఆదివారం అందించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ముహూర్త నిర్ణయం ప్రకారం.. 28న రథ సప్తమి పర్వదినం రోజున మొదలుకుని రాత్రి 1.56 గంటలకు స్వామివారి కల్యాణం, 29న గురువారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం, 1న ఆదివారం ఉదయం 8గంటలకు స్వామివారి చక్రస్నానం (సముద్రస్నానం), 2న సాయంత్రం 6 గంటలకు స్వామివారి తెప్పోత్సవం జరుగుతాయి. మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో 9రోజులు స్వామివారు ఒక్కో వాహనంపై గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం (వాహనసేవ) జరుగుతుంది. స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లలో భాగంగా వివిధ శాఖల అధికారులతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి అధ్యక్షతన డిసెంబరు 4న ఉదయం 11 గంటలకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ పేర్కొన్నారు.

అజాత శత్రువు వాజపేయి

ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నతుడు: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

వాజపేయికి మండపేటతో విడదీయని బంధం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఏపీలోనే తొలిసారిగా మండపేటలో వాజపేయి విగ్రహం ఏర్పాటు



సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, హాజరైన ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు



వాజపేయి విగ్రహానికి పూలదండ వేస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాధవ్

మండపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా పనిచేసిన దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయాల్లో అజాత శత్రువని, ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఆదివారం వాజపేయి విగ్రహాన్ని రాజమహేంద్రవరం ఎంపీతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని తాపేశ్వరం వేడుక ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ దేశప్రధానిగా స్వర్ణభూజ్ పథకం గ్రామాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వైద్య టెలికాంరంగాలకు వాజపేయి ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. దేశ సమగ్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విమానయానం ప్రపంచ దేశాలతోపాటు అణుబాంబు తయారీ చేయడం వంటి విషయాల్లో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ధైర్యశాలీ వాజపేయి అని మాధవ్ అన్నారు. వాజపేయికి మండపేటతో విడదీయరానీ బంధం ఉందన్నారు. మండపేటకు 1983లో వాజపేయి వచ్చినపుడు బీజేపీ సీనియర్ నాయకుడు వల్లూరి పార్థసారది ఇంట ఆతిథ్యం స్వీకరించిన విషయాన్ని మాధవ్ గుర్తుచేశారు. మండపేటలో బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన వాజపేయి విగ్రహం రాష్ట్రంలోనే తొలి విగ్రహమని, ఇక్కడ బీజేపీ శ్రేణుల స్ఫూర్తితో రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాజపేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సభలో మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, యాళ్ల దొరబాబు, సుబ్బారావు, కర్రి చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు

రూ.1000కోట్లు ఖర్చు అంచనా.. ఇప్పటికే రూ.100కోట్ల నిధుల విడుదల

రామవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్, పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించే విధంగా నిర్వహించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్కరాలకు రూ.1000కోట్లు ఖర్చు అంచనా వేయడం జరిగిందని, ఇప్పటికే రూ.100కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పుష్కరాల సందర్భంగా చేపట్టే పనులు పూర్తిస్థాయిలో పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టడం చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పుష్కరాల పనుల ప్రణాళిక కోసం కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటించడం జరిగిందన్నారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీజేపీ యంత్రాంగానికి తగిన సూచనలు, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొన్నారు.

మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అమలాపురం వేదిక

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు
- పాల్గొన్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ప్రభుత్వ విప్ దాట్ల, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన చైతన్యరాజు, ప్రభుత్వ విప్ సుబ్బరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అమలాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణం వేదిక కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 మార్చి 1వ తేదీన కిమ్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆ సంస్థ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు మహాసభలకు సంబంధించి ఆదివారం కిమ్స్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ ఆర్భాటంగా జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీన జరిగే ఈ మహాసభలను ప్రతీ ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఘనంగా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాకే గర్వకారణంగా నిలిచే రీతిలో ప్రపంచానికి తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియచేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలసికట్టుగా పనిచేస్తాం...

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ మహాసభలను తాము బాధ్యతగా తీసుకుని 2రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు తామంతా కలసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఇక్కడకు సమీపంలోని ఆంధ్ర, గోవా, కోకో బీచ్‌లో ఏర్పాట్లను చేస్తున్నట్టు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రెస్టారెంటు, వాటర్ స్పోర్ట్స్ బీచ్ వాలీబాల్, ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేకునేలా బీచ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సభలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబుతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ పి.విజయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ మోహనరాజు, ఎస్టీయూ నాయకులు దొరబాబు, పినిపే సత్యనారాయణ, బండారు రామ్మోహనరావు, ఎస్వీ నాయుడు మాట్లాడారు. రాజమహేంద్రవరం వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలు 2 పర్యాయాలు నిర్వహించారని, మూడో పర్యాయం అమలాపురంలో నిర్వహించడానికి నిర్ణయించామని చైతన్యరాజు ప్రకటించడంతో పాటు సభల్లో విద్యార్థులకు తెలుగు భాషా ప్రావీణ్యంలో పలుఅంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా భాషాభిమానాన్ని పెంపొందించడానికి కీలకంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులుపేర్కొన్నారు.

10వేల మందితో శోభాయాత్ర..

సభకు అధ్యక్షత వహించిన కేవీవీ చైర్మన్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ప్రపంచ తెలుగు మహాసభలను జిల్లా ఖ్యాతిని ప్రపంచదేశాల్లో ఇనుమడింపచేసేలా అమలాపురంలో నిర్వహిస్తామని తెలిపారు. 10వేల మందితో ఫిబ్రవరి 28న శోభాయాత్ర పట్టణంలో నిర్వహిస్తామన్నారు. వెయ్యి మందికి పైగా కవులతో సమ్మేళనం, వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎం లతో సహాయ తెలుగుభాష కోసం పనిచేస్తున్న ప్రపంచంలో పేరెన్నిగన్న వ్యక్తులందరినీ ఈ వేదికపైకి పిలిచి సత్కరించనున్నట్టు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి...

బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తరలివచ్చిన ఉపాధ్యాయులు.. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సెల్ఫీలు తీసుకుంటూ కబుర్లు చెపుకుంటున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న వీసీ, ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. విశ్వవిద్యాలయంలో తొలిసారి తొలి సమావేశంగా జరిగిన ఈ సమ్మేళానికి పూర్వ విద్యార్థులు అనేకమంది వచ్చారు. వారిలో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. వారంతా క్లాస్ రూమ్స్‌కి వెళ్లి అలనాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని, ఇక్కడకు విశ్వ విద్యాలయం రావడంతో తెలుగు భాషా అభిమానిగా తన పాత్ర కూడా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు కూడా ఈ విశ్వ విద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి సమ్మేళనాల వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని, ఇంత మంది ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేకత చెప్పడంతో మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. వీసీ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో ఉన్న శాఖలన్నీ దశలవారీగా ప్రవేశపెట్టి, వచ్చే ఏడాది నుంచి విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టామని, కోర్సుల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చామని, చాలా కోర్సులకు మంచి స్పందన ఉందని చెప్పారు. పూర్వ పీఠాధిపతి బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తరచు కలుసుకుంటూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వీసీ నాయుడికి విశ్వవిద్యాలయంపై పూర్తి అవగాహన ఉందని, ఆయనకు అందరూ సహకరిస్తే బాగా అభివృద్ధి చేయగలరన్నారు. ప్రముఖులు రెంటాల వేంకటేశ్వర్లు, కూర్మయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డ అదరగొట్టింది..

'బాల సాహిత్య బేరీ'లో పాల్గొన్న గురుత్వ సమందా సింగ్



సమందా సింగ్

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డ మడివి గురుత్వ సమందా సింగ్ ప్రపంచ సాహిత్య వేదిక ప్రశంసలు అందుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గూడూరుకు చెందిన మడివి నెహ్రూ దంపతుల పెద్ద కుమార్తె గురుత్వ సమందా సింగ్ భద్రాచలం యజ్ఞజా పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. కాగా తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పర్చు వల్ పద్ధతిన బాల సాహిత్య బేరీ పేరిట అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించింది. ఇందులో పాల్గొనే అవకాశం గురుత్వ సమందా సింగ్‌కు కలిగింది. కార్యక్రమం దాదాపు 13 గంటల పాటు సాగింది. ప్రపంచవ్యాప్తంగా 101మంది తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు. కథ, వచన కవిత్వం, గేయం, పద్య విభాగాల్లో ప్రతిభ చాటారు. గురుత్వ సమందా సింగ్ కథ విభాగంలో ఆదివాసీ సంప్రదాయ వేషధారణలో పాల్గొంది. దేశవ్యాప్తంగా ఆదివాసీలు చేసుకునే పేన్ పండుం (ఇలవేల్పులు, పితృదేవుళ్లు) ఇతివృత్తాన్ని కేవలం 3 నిమిషాల్లో వివరించింది. పలు విశ్వ విద్యాలయాల వీసీలు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాలసాహితీవేత్తలు గురుత్వ సమందా సింగ్‌పై ప్రశంసలు కురిపించారు. పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ ఉషారాణి విద్యార్థినిని అభినందించారు.

హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం

భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి నేదూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మతాలు, కులాలు, జాతులు, వర్గాల నుంచి మనుషులు స్వేచ్ఛా జీవులు కావాలన్నారు. ఆధునిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ మూఢ విశ్వాసాల్లో ఎందరో కూరుకుపోతున్నారని విమర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ మహాసభలు ఆదివారం అమలాపురం ఎస్టీయూ జిల్లా శాఖ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా సత్యనారాయణ మాట్లాడుతూ హేతుబద్ధ ఆలోచనలతో ప్రతీ వ్యక్తి పాశవిక నిర్ణయాలు తీసుకుని యథార్థాన్ని గ్రహించాలన్నారు. విశ్వ అవగాహనతో జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం, విశ్వ పరిణామం-జీవపరిణామం నిత్య జీవితంలో హేతువాదం అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. నేదూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం గ్రంథాన్ని జనిపెల్ల భీమారావు ఆవిష్కరించి ద్వంద్వ సమీక్ష చేశారు. ఉమ్మడి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డి.రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలీ, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ, డి.ప్రకాష్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా.. వ్యాన్ బోల్తా

ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు







ప్రమాద స్థలంలో వ్యాన్, క్షతగాత్రులు

దేవీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా వ్యాన్ బోల్తా పడి ఒకరి మృతిచెందగా ఐదుగురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గండి పోశమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. సాయంత్రం వరకు ఉండి బయలుదేరారు. మద్యంమత్తులో డ్రైవర్ వ్యాన్‌ను నడపడంతో దేవీపట్నం మండలం అంగులూరు గ్రామ శివారుకు వచ్చేసరికి అదుపుతప్పి రహదారి పక్కన లోయలోకి వ్యాన్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో యలమంచిలి మండలానికి చెందిన కంద్రేకుల నరసింహస్వామి (39) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురికి గాయాలు కావడంతో సీతానగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రంపచోడవరం సీఐ సన్యాసినాయుడు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ప్రమాదస్థలికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దర్శనాలు ఆపినా ఆగని భక్తులు...

గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరుకోవడంతో గత కొన్ని నెలలుగా అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే అంగుళూరు మెట్టపైన అమ్మవారి విగ్రహం ఉండడంతో పోశమ్మ గండి వచ్చిన భక్తులు ఇక్కడే దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అంగుళూరులో బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు జరపడంతో వచ్చిన భక్తుల్లో పలువురు మద్యం తాగి ఇలా ప్రమాదాల బారిన పడు తున్నారని, ఇప్పటికైనా బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిమ్నాస్టిక్స్ ఓవరాల్ చాంపియన్

'తూర్పు గోదావరి'



బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీలు పద్మశ్రీ, గోపిమూర్తి

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా, రెండో స్థానంలో గుంటూరు జిల్లా, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు బొర్రా గోపిమూర్తి, కర్రి పద్మశ్రీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, సెక్రటరీ పి.శ్రీనివాస్, మాజీ సెక్రటరీ ఎల్.జార్జ్, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

'దళిత, గిరిజన అభివృద్ధి కార్యక్రమాలకు తగిన బడ్జెట్ కేటాయించాలి'

కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా-అంబేడ్కర్ (ఆర్పీఐ) అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ అమరావతిలో మర్యాదాపూర్వకంగా కలిశారు. దళిత, గిరిజన అభివృద్ధి కార్యక్రమాలకు తగిన బడ్జెట్ కేటాయించాలని, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.


నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న షేక్ ఖలీఫాతుల్లా

'ఇండస్ట్రియల్ హబ్‌గా కాకినాడ'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఇండస్ట్రియల్ హబ్‌గా రూపుదిద్దుకుంటుందని బీజేఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆల్ ఇండియా పోర్టు ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా పేర్కొన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో బీజేఎంసీ ప్రత్యేక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో పాత కార్మిక 29 చట్టాలకు బదులు కార్మికులకు భద్రత కల్పించేందుకు నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టారన్నారు. కాకినాడ ఇండస్ట్రియల్ హబ్‌గా మారి పరిశ్రమల స్థాపనతో వేలాది మంది కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా మజ్దూర్ సెల్ కృషి చేస్తుందన్నారు. బీజేఎంసీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా అడదాకుల రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ ఖదీర్‌లను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషా నియామక పత్రాలు అందజేశారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ, బీజేఎంసీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇమామ్, ముస్లిం వెల్ఫేర్ నాయకులు షేక్ మహ్మద్, పోర్టు చైర్మన్ పర్సనల్ సెక్రటరీ పఠాన్ సాహిద్ ఖాన్, కూటమి నాయకులు మహ్మద్ అబ్దుల్ రెహమాన్, సయ్యద్ ఖాజా మొహిద్దీన్, మహ్మద్‌అసదుల్లాబేగ్, దాసరి శ్రీనివాసు పాల్గొన్నారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి, పాదగయలో స్వయంభూ దత్తాత్రేయస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా సహస్ర చామంతి అర్చన

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో మూడో రోజైన ఆదివారం సహస్ర చామంతి అర్చన నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు పుష్పాలతో విశేష అలంకారం చేశారు. ఉదయం మహా గణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహన్యాస పూర్వక ఏకాదశ శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామికి లక్ష బిల్వార్చన జరిగింది. ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. పుష్పార్చన అనంతరం దత్తాత్రేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు, భక్తులు పాల్గొన్నారు.

పాదగయలో స్టేట్ ఆడిట్ ఆర్‌డీడీ పూజలు

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ బీఆర్ క్రాంతికుమారి ఆదివారం సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనం ఇచ్చారు. క్రాంతికుమారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ అందజేశారు. ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, ఆడిటర్లు భ్రమరాంబ, విజయదుర్గ, నందిని, లత, ఝాన్సీ, సత్యనారాయణ, సూపరింటెండెంట్ వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి దత్తాత్రేయ పాల్గొన్నారు.


క్రాంతికుమారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహనశ్రీనివాస్

'కామేశ్వరరావు సేవలు ఎనలేనివి'

కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల అభివృద్ధికి కామేశ్వరరావు చేసిన సేవలు ఎనలేనివని ఏపీఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ కొనియాడారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికోద్యమ నాయకుడు ఎస్‌ఏఎస్ కామేశ్వరరావు 52వ వర్ధంతిని ఆదివారం నగరంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఈఈ డీఈ ఉదయ్‌భాస్కర్, విశిష్ట అతిథులుగా టౌన్-1 ఏడీ వీరభద్రరావు, రూరల్ ఏడీ మురళి హాజరయ్యారు. కామేశ్వరరావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం జరిపారు. సంఘ కార్యదర్శి పిల్లి నాగేంద్ర, నాయకులు హరిబాబు, వీరబాబు, చలం, రమణ, శ్రీనివాస్, రాజు, ఏఈ సునీల్ కుమార్, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, అన్ని అసోసియేషన్ల ప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఈ ఉదయ్‌భాస్కర్

28న పిఠాపురంలో హిందూ సమ్మేళనం

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిఠాపురంలో డిసెంబరు 28న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ కుటుంబ సంయోజక్ పెమ్మరాజు సత్యరామ చంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సమ్మేళనానికి గౌరవ అధ్యక్షురాలిగా నియో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ బుర్రా దివ్యరాజ్, అధ్యక్షుడిగా బాదం ఉదయసూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా తోలేటి శిరీష సహా 20 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, బీజేపీ నాయకుడు డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జీఎస్ఎల్ సీఈవో గోవిందురాజు, బీజేపీ పట్టణ కార్యదర్శి కంబాల నాగేశ్వరరావు, న్యాయవాది నాళం నారాయణరావు (జేబీరావు) తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 450 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ పిలుపునిచ్చారు. పిఠాపురంలో రెండు రోజులు నిర్వహించిన కాకినాడ జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని రథాలపేట సెంటర్లో గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ప్రతినిధుల సభలో రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ 55ఏళ్లుగా పోరాటం సాగిస్తోందన్నారు. పీజీ విద్యార్థులకు గుదిబండగా మారిన జీవో నెం.77ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు సమస్యల వలయంలో చదువులు సాగిస్తున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ6,400 కోట్ల వరకు ఉన్నాయని, తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పీజీ కళాశాల లేకపోవడం లోటుగా ఉందన్నారు. విద్యార్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు లేక కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు రాకపోకలు సాగించే సమయాల్లో ప్రత్యేక బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.

ప్రతినిధుల సభ ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజంతో కూడిన పతాకాన్ని జి.చిన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జి.శ్రీకాంత్, సీహెచ్ సాహిత్, అమృత, లోవరాజు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన సభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగ సూరిబాబు, సిద్ధు, జయరాం, సంతోష్, తేజ, విపిన్, మణికంఠ, నాని, వరహాలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

'లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకూడదు'

సర్పవరం జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'యువత కోరుకుంటే సాధించలేనిది ఏదీ లేదు... ఎన్ని కష్టాలు, అవరోధాలు ఎదురైనా లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించకూడదు... అప్పుడే ఉజ్వల భవిష్యత్తు సాకారమవుతుంది' అని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన ఆయన సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖలో రాణించాలంటే ఒత్తిడిని తట్టుకుని విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. మంచి క్రమశిక్షణ, దేహదారుఢ్యం కోసం వ్యాయామం తప్పనిసరన్నారు. ఏపీఎస్పీలో 1984లో ఆర్ఎస్ఐగా చేరిన తాను అంచెలంచెలుగా కమాండెంట్ స్థాయికి చేరుకోవడంలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకపాత్ర పోషించిందన్నారు. 41 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పని చేశానని, 1996 నుంచి 1998 వరకు సీఎం చంద్రబాబుకి ముఖ్య భద్రతా అధికారిగా సేవలు అందించానన్నారు. నాగేంద్రరావు దంపతులను అదనపు ఎస్పీ (ఏఆర్) శ్రీనివాసు, అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.మన్మధరావు, డి.మురళీకుమార్, గంగరాజు, మోహన్‌రావు, బీడబ్ల్యూవో మురళీమోహన్‌రావు, ఆర్ఐలు హరిబాబు, అజయ్‌కుమార్, రాజు, రవిశంకర్, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు పి.లక్ష్మీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నాగేంద్రరావుకు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు


శివలింగానికి అభిషేకం చేస్తున్న విజయకుమారరాజు

భీమేశ్వరస్వామికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్

వైస్ ప్రెసిడెంట్ పూజలు

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వి.విజయకుమారరాజు ఆదివారం రాత్రి సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. రెండు జిల్లాల ప్రతినిధులతో కలిసి వచ్చిన ఆయనకు పండితులు చెరుకూరి సుందరరామయ్య, వెంకన్న, రాజగోపాలశర్మ వేదమంత్రాలతో స్వాగతం పలకగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు శాలువా కప్పి ఆహ్వానించారు. విజయకుమారరాజు భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి పుష్పార్చన చేశారు. ఆలయ ఆవరణలో శివలింగానికి క్షీరాభిషేకం జరిపారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనం, ప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటం స్వీకరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈదర ఈశ్వరకుమార్, మేకా శ్రీరామ్‌సురేష్, డీఎస్ఎస్వీ వర్మ, చిట్నీడి శ్రీనివాసు, పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, వజ్రపు కోటేశ్వరరావు, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

'రక్తదానంతో ఆదుకోవాలి'

తాళ్లరేవు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాలని మానవతావాదులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కోరారు. టీడీపీ నేత ధూళిపూడి వెంకటరమణ (బాబీ) పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పి.మల్లవరంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, 10వ క్లస్టర్ ఇన్‌చార్జి మోహూరి వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రోళ్ల శ్రీనివాసచక్రవర్తి, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సర్పవరం జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ కోరారు. వీఎస్ఎల్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరగాళ్లు తొలుత మన డేటాను చోరీ చేసిన అనంతరం అమ్మాయిలతో వాట్సాప్ మెసేజ్‌లు పంపుతారన్నారు. దానికి స్పందించిన వారు సమస్యల్లో చిక్కుకుంటున్నారన్నారు. నేరగాళ్ల బెదిరింపులకు భయపడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారన్నారు. సైబర్ నేరం జరిగితే 1930 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ అధికారి కె.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఉద్యోగులకు క్రీడా పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా కాకినాడ ప్రాంతీయ కార్యాలయ సభ్యులకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యోగుల సంఘం వైస్ చైర్‌పర్సన్ పి.అరుణ పోటీలను ప్రారంభించారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. సంఘ సభ్యులు శ్రీధర్, రాంబాబు, సూర్య దుర్గారామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందజేస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘం వైస్ చైర్‌పర్సన్ అరుణ

'మహిళా స్వయం సహాయక సంఘాలకు

రుణాలు సక్రమంగా అందట్లేదు'

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ అధ్యక్షతన ఎంపీపీ పెంకే సత్యవతి ఆధ్వర్యంలో పెద్దాపురం మండల సర్వసభ్య సమావేశం ఆదివారం సాదాసీదాగా జరిగింది. మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు సక్రమంగా అందట్లేదని, అవగాహన కల్పించడంలో యానిమేటర్లు పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. యానిమేటర్లు బ్యాంకు అధికారులతో కుమ్మక్కై అక్రమ మార్గంలో రుణాలు పొందుతున్నారు. మర్లావ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని, రహదారిని విస్తరించాలని కోరారు. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు ఉండట్లేదని, దీనిని వేరే కేంద్రంలో కలపాలని లేదా చిన్నారులు కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. తిరుపతి రహదారి ఆక్రమణలకు గురైందని, దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారిందని.. శృంగారవల్లభస్వామి ఆలయానికి వచ్చే భక్తులు అవస్థలు పడుతున్నారన్నారు. రహదారిని తక్షణం విస్తరించాలన్నారు. కాండ్రకోట ఎంపీటీసీ జాగు వీరభద్రరావు మాట్లాడుతూ మరిన్ని నిధులు మంజూరు చేసి రహదారులను విస్తరించాలన్నారు. అనంతరం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలకు సహకరిస్తా: వనమాడి

కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాలకు కావాల్సిన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హామీ ఇచ్చారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆదివారం ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు కడలి నాగరాజులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరబ్రహ్మం మాట్లాడుతూ 26 జిల్లాల్లో నూతన కమిటీలను వేసి సంఘాన్ని బలోపేతం చేశామని చెప్పారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు అద్దంకి వెంకన్నబాబు, గంటి రాధాకృష్ణ, వాసంశెట్టి చక్రపాణి, నగర శాఖ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంగాడి రాజసింహవర్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

ముగిసిన మెగా దంత వైద్య శిబిరం

పిఠాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో జీఎస్ఎల్ ఆసుపత్రి, నియో విద్యా సంస్థలు, షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీ-4లో భాగంగా పట్టణంలోని రెడ్డిరాజా కల్యాణ మండపంలో మూడు రోజులు నిర్వహించిన మెగా దంత వైద్య శిబిరం ఆదివారం రాత్రి ముగిసింది. సుమారు 200 మంది దంత వైద్యులు, సిబ్బంది 6వేల మందికి దంత సంబంధ చికిత్సలను ఉచితంగా చేశారు. చివరి రోజు శిబిరాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ ప్రజలకు రూ.2కోట్లు విలువైన చికిత్సలను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. షి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ బుర్రా దివ్యరాజ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పాడా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు, జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొరబాబు

పెంచలయ్యకు ప్రజా సంఘాల నివాళి

కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గంజాయి ముఠాల చేతిలో హత్యకు గురైన యువ కళాకారుడు పెంచలయ్యకు నివాళులర్పిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వివేకానంద పార్కు మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సీటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నాయకురాలు కె.నాగజ్యోతి మాట్లాడుతూ దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, నాగాబత్తుల సూర్యనారాయణ, సీహెచ్ సతీష్, ఓలేటి శ్రీనివాస్, సీహెచ్‌వేణు, యు.సత్యనారాయణ పాల్గొన్నారు.




పల్లవిని అభినందిస్తున్న కోచ్ సురేష్

జిమ్నాస్టిక్స్ జాతీయ పోటీలకు

పల్లవి ఎంపిక

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిమ్నాస్టిక్స్ జాతీయ స్థాయి పోటీలకు ఆర్బీపట్నం గ్రామానికి చెందిన మన్యం పల్లవి ఎంపికైందని కోచ్ ఎస్.సురేష్ తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన 69వ అంతర్ జిల్లాల ఎస్జీఎఫ్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో పల్లవి అండర్-14 విభాగంలో ఫ్లోర్ ఈవెంట్‌లో ద్వితీయ స్థానం సాధించింది. వచ్చే ఏడాది జనవరిలో కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటుంది.

అకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



కాకినాడ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్ నగర్ ఎంఎస్ఎన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో నాగూర్ వల్లీ ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఓ విద్యార్థి చెవిలో గ్లాసుతో నీరు పోసి మరో విద్యార్థి చెవిలోంచి తీయడం, గాలిలోంచి కాగితం దండలు రప్పించడం అబ్బురపరిచాయి. ఇంద్రజాలికుడిని కరస్పాండెంట్, నేషనల్ టీచర్ అవార్డు గ్రహీత లక్ష్మీ తులసి అభినందించారు. డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలతో విద్యార్థులు మానసికోల్లాసం పొందుతారన్నారు.



శబరిమలకు పాదయాత్ర

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి శబరిమలకు అయ్యప్పస్వాములు ఆదివారం పాదయాత్రగా బయల్దేరారు. చేబ్రోలు, పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్పదీక్షాధారులు గాజుల గంగా సత్యనారాయణ, అరటికట్ల అప్పారావు, వలవల నందిబాబు, పెపుపోతుల శ్రీను, కుంచే కామేశ్వరరావు, వెలుగుల మణికంఠ ఐదోసారి కాలినడకన అయ్యప్పస్వామి సన్నిధికి వెళ్లాలని నిర్ణయించారు. శబరిమల చేరుకునేందుకు 42 రోజులు పడుతుందని, సంక్రాంతికి మకరజ్యోతి దర్శనం చేసుకుంటామని వారు చెప్పారు.



మయూర వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. షష్టి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మయూర వాహనంపై గ్రామవీధుల్లో విహరించారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజలు చేయగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌పోజర్ విజిట్

సామర్లకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 మందిని హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ఆదివారం తూర్పు గోదావరి జిల్లాకు బస్సులో తీసుకెళ్లారు. వారికి బొమ్మూరులోని సైన్స్ సిటీ, ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం, కాటన్ బ్యారేజ్, రాజమహేంద్రవరంలోని రోడ్ కం రైలు వంతెన, ఇస్కాన్ టెంపుల్, కడియం నర్సరీలను చూపించారు. ఉపాధ్యాయులు ఎన్.హరినాథ్, బీఆర్‌ఎస్ శివకుమార్, సీహెచ్ బబిత, జె.ప్రవీణ, జి.జ్యోతి, జి.యాదిత్య, వి.దుర్గాప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా

పోలీసుల సైకిల్ ర్యాలీ

పెద్దాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రారంభించిన అభ్యుదయం సైకిల్ యాత్రకు విశేష స్పందన లభించింది. డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. పోలీసులు కరపత్రాలు పంచుతూ, డ్రగ్స్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐలు విజయశంకర్, కృష్ణభగవాన్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏవీ నగ రం విద్యుత్ సబ్‌స్టేసన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జగ్గంపేట డీఈ వీరభద్రరావు ఒక ప్రకట నలో తెలిపారు. 33 కేవీ నూతన విద్యుత్ లైన్ ని ర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడుతుందన్నారు. ఏవీ నగరం, పెరుమాళ్ళపురం, శృంగవృక్షం, కోదాడ, సీతారాంపురం గ్రామా లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తాగునీటికి కటకట

● మరమ్మతులకు నోచుకోని బోరు ● ఒడియా క్యాంపువాసుల ఇక్కట్లు



పవర్ కెనాల్ నుంచి నీళ్లు తీసుకెళుతున్న ఒడియా క్యాంపు గ్రామస్థులు, పని చేయని బోరు

మోతుగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఒడియా క్యాంపు గ్రామంలో రెండునెలల నుంచి నీటిసమస్య నెలకొంది. అక్కడ ఉన్న చేతి బోరు పనిచేయడం లేదు. గ్రామంలో మోటార్ కూడా పని చేయట్లేదు. దీంతో ఒడియా క్యాంపు గ్రామస్థులు తాగునీటి సమస్య తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు తెచ్చుకోవాలంటే పవర్ కెనాల్ నుంచి తెచ్చుకోవాలి. ఈ కెనాల్‌లో దిగాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దిగాలి. ఒడియా క్యాంపు గ్రామస్థులు మా బోరు పాడై పోయింది అని చాలాసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఒడియా క్యాంపుప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కిలోమీటరు దూరంలో ఉన్న పవర్ కెనాల్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఈ గ్రామంలో రోడ్డు సౌకర్యం సరిగాలేకపోవడంతో రాత్రి సమయంలో నీళ్లు తెచ్చుకోవాలంటే ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒడియా క్యాంప్ గ్రామంలో బోర్, మోటార్ మరమ్మత్తులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామ బహిష్కరణ కేసు పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాధిత మహిళ గంగాభవాని

రంపచోడవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ బహిష్కరణ కేసును పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు దిరిసినపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ బల్లెం గంగాభవాని ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ కుటుంబాన్ని గ్రామంలో వెలివేయగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. విచారణకు వచ్చిన అధికారులు కేవలం క్వారీ వలన జరిగే నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చామని చెప్పి సదరు అధికారులు గ్రామస్థులను రెచ్చగొట్టి తమపై దాడి చేయించారని ఆరోపించారు. పోలీసు అధికారులు దాడికి గురైన తమపై కేసు నమోదు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రత్యేకాధికారిని నియమిం చాలని జిల్లా ఎస్పీని ప్రకటనలో కోరారు.

ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

● జిల్లా అధ్యక్షుడిగా మంగిరెడ్డి

రంపచోడవరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కారం రంగారావు ఆధ్వర్యంలో ఎన్నుకు న్నారు. జిల్లా అధ్యక్షుడిగా బుడమల మంగిరెడ్డితోపాటు 19మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర నాయకులు పల్లాల బాలురెడ్డి, కారుకోడి గాంధీబాబు, చవలం సత్యనారాయణ, మేడ సింహాచలం, నైని లింగారెడ్డి పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోండి

దేవీపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని దేవీపట్నం వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 500 హెక్టార్లలో కోతలు జరిగాయన్నారు. కొన్నిచోట్ల ధాన్యం రాశులు, పనమీద, కొన్నిచోట్ల కుప్పలుగా వేశారన్నారు. వీటిపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసిపోకుండా చూసుకోవాలన్నారు.

మావోల బంద్ పాక్షికం

వై.రామవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఆదివారం మావోయిస్టులు తలపెట్టిన ఏజెన్సీ బంద్ పిలుపుమేరకు అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో పాక్షికంగా జరిగింది. ఏలేశ్వరం, గోకవరం డిపోల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. ప్రయాణి కులు ఇబ్బందులకు గురయ్యారు. వ్యాపార దుకాణాలు యథావిధిగా తెరిచారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలో జాతీయరహదారి 516పై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొల్లిమెట్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు భీమన్నరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమన్న రెడ్డి ఆదివారం ఉదయం మొల్లిమెట్ల నుంచి రాజవొమ్మంగి వస్తుండగా రాజవొమ్మంగి గ్రామంలోని పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో భీమన్నరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో భీమన్నరెడ్డిని రాజవొమ్మంగి ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఆసుపత్రికి బంధువులు తరలించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

మోతుగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నిత్యం కార్మికుల సమస్య లపై పోరాడుతూ, కార్మికహక్కులపై నినదిస్తూ శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని పోరాడుతున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) అఖిలభారత 18వ మహాసభలు డిసెంబర్ 31నుంచి జనవరి4 విశాఖపట్నంలో జరుగుతున్నాయని ఈ మహాసభలను ప్రతి కార్మికుడు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, ఉపాధ్యక్షుడు చింత రాంబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సభలో వెంకట్ రాంబాబులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదకొండున్నరఏళ్లలో కార్మికులకు తీవ్ర నష్టంకలిగించే విధానాలను తీసుకొచ్చారని, దానిలో భాగంగానే నవంబరు 21న లేబర్ కోడ్ అమల్లోకి వస్తాయని ప్రకటించారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు విశాఖ వేదికగా సీఐటీయూ అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని ఆ మహాసభలను ప్రతి కార్మికులు జయప్రదం చేయాలని అన్నారు. అనంతరం అఖిలభారత మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కార్మికులు నూకరత్నం, ముక్త, నాగమణి, డేవిడ్, సరస్వతి, మాధవ, సన్మతి, లైకాన్ , సుబ్బలక్ష్మి, సన్యాసమ్మ, రోజా పాల్గొన్నారు.

అమరజీవి కామేశ్వరరావు వర్ధంతి

మోతుగూడె, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):విద్యుత్ కార్మిక రత్న, అమరజీవి ఎస్ఏఎస్ కామేశ్వరరావు 52వ వర్ధంతి మోతుగూడెం 327 యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. స్టోర్స్ ఏడీఈ సత్యనారాయణ కామేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రీజనల్ సెక్ర టరీ పి.ఆనందబాబు, ఎంఆర్‌వీ రమణ, బ్రాంచ్ సెక్రటరీ టి. దుర్గాప్రసాద్ తదితర సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైద్య శిబిరంలో 130 మందికి పరీక్షలు

రంపచోడవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామకృష్ణమిషన్ గిరిజనసంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిండల పాడులో నిర్వహించిన వైద్యశిబరంలో 130మందికి వైద్యసేవలు అందించినట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందజీ మహరాజ్ తెలిపారు. వైద్యశిబిరంలో 55 మందికి రక్త పరీక్షలు, 8 మందికి థైరాయిడ్, ముగ్గురికి ఈసీజీలు, ఎక్స్‌రే ఒకరికి, 8మందికి ఫిజియోథెరపీ చేసినట్టు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అన్నదాతల్లో తుఫాన్ బెంగ

● వాతావరణం మారడంతో రైతుల్లో ఆందోళన
● ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న దిత్వా తుఫాను ప్రభావంతో జిల్లాలోని రైతులు అప్రమత్తమయ్యారు. పలుచోట్ల చిరుజల్లులతో కూడిన వర్షం పడుతోంది. వ్యవసాయాధికారుల సూచనలతో వరికోతలను వాయిదా వేసుకున్నారు.



మల్లేపల్లిలో ధాన్యానికి బరకాలు కప్పుతున్న రైతులు

కిర్లంపూడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలంలో పలు గ్రామాల్లో ఆకాశం మేఘావృతమైంది. దీంతో రైతులు ఆందో ళన చెందుతున్నారు. వరికోతలు కొంత వరకు పూర్తయినప్పటికీ కుప్పలు ఇంకా మిగిలిపోయాయి. ఆదివారం నాటికి వాతావరణం మారిపోవడంతో కోతలు కోసిన రైతులు హడావిడిగా కుప్పలు వేయడం మొదలు పెట్టారు. పంట పక్వానికి వచ్చిన పొలాల్లో వరి కోతలను రెండుమూడురోజులపాటువాయిదా వేసుకున్నారు. తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సుధామాధురి రైతులకు సూచించారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

● వ్యవసాయాధికారి పద్మశ్రీ

తొండంగి,(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేయాలని వ్యవసాయాధికారి పద్మశ్రీ రైతులకు సూచించారు. తుఫాను ప్రభావంతో కోసిన పంట తడిసి ధాన్యం నాణ్యత తగ్గే అవ కాశం ఉన్నందున డిసెంబరు 2 వరకూ రైతులు కంగారు పడి వరి కోతలు కోయవద్దన్నారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు తమ పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని టార్పాలిన్ క్లాత్‌తో కప్పాలని రైతులకు సూచించారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 13050 ఎకరాల్లో వరి పంట సాగుకాగా వీటిలో 5874 ఎకరాల్లో ఏ గ్రేడ్ రకం, 7176 ఎకరాల్లో సాధారణ రకం సాగయ్యిందన్నారు. ఇప్పటివరకూ 2560 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను గమనించి కోతలు కోయాలన్నారు. ప్రభుత్వం 17 శాతం తేమ ఉన్న వరిని ఎంఎస్‌టీ ధరకు కొనుగోలు చేస్తోందని అంతకంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయొద్దన్నారు. ఆర్ఎస్‌కేల వద్ద గోను సంచులు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని పద్మశ్రీ కోరారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతులు అప్రమత్తం

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ఎక్కువగా కురవడంతో తడిసిన ధాన్యాన్ని రైతులు మండలంలో జాతీయరహదారి పక్కన ఆరబోసుకుంటున్నారు. వాతావరణం రైతులను బెంబేలెత్తిస్తోంది. అప్పటికప్పుడే ఎండ, వెంటనే మబ్బులు కాయడంతో ధాన్యం ఆరబెట్టుకోవడం, పోగుచేసుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం తుఫాన్ హెచ్చరికలతో వాతావరణ మార్పులతోచినుకులు పడడంతో మల్లేపల్లిలో రైతులు ధాన్యాన్ని హడావిడిగా పోగుచేసుకుని బస్తాల్లో ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు.

తునిరూరల్(ఆంధ్రజ్యోతి):దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి వాతావరణం మేఘాలతో ముసురు కమ్ముకుంది. సాయంత్రం అయ్యే సరికి తుని, రూరల్ ప్రాం తాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో గ్రామీణ రైతాంగం ఆందోళన చెందారు. వరి పంట చేతికి వచ్చే సమయంలో దిత్వా తుఫాన్ ఏనష్టం కలిగిస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రత్తిపాడులో వరి పనలను ఒబ్బిడి చేస్తున్న దృశ్యం

రైతులకు వ్యవసాయాధికారుల అవగాహన

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిత్వా తుఫాను గురించి కాట్రావులపల్లిలో రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు తొలకరిలో వేసిన 10230 ఎకరాలకుగాను 7270 ఎకరాల వరకు కోతలు పూర్తయ్యాయి. రానున్న మూడు రోజుల్లో వర్షాలు అధికంగా ఉంటాయి, రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు కోరారు.

ప్రత్తిపాడులో చిరుజల్లులు

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): ఆదివారం ప్రత్తిపాడు మండలంలో చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. దీంతో ఖరీఫ్ వరి కోతలు ముమ్మరం అయిన తరుణంలో వాతావరణం ఒక్కసారిగా మారి చిరుజల్లులు పడటంతో రైతులు కోతలు కోసిన వరి పంటలను ఒబ్బిడిచేసుకునే పనిలో తలమునకలయ్యారు. మండల వ్యాప్తంగా దాదాపుగా గడిచిన 4రోజులుగా 2వేల ఎకరాలు పైబడి పొలాల్లో వరి కోతలను రైతులు నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



తేటగుంటలో ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

తునిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో తుని నియోజకవర్గానికి చెందిన పలువురుకు ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య సీఎం సహాయ నిధి నుంచి వెలువడిన నగదు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మూడు లక్షల 45వేల రూపాయలకు సంబంధించిన నగదు చెక్కులను రాపాక టీడీపీ నాయకులు మంతెన గంగాధర్, గంధం బాబ్జి, కుమ్మర్లలోవ నాయకులు జక్కాన రాము నాయుడు, పోతల రాంబాబు, హంసవరం నాయకులు కాలిబోయిన గంగారావు తదితరుల సమక్షంలో ఈ చెక్కులను అందజేశారు.

ప్రజల్లో మమేకంతో సత్ఫలితాలు

● తుని ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నిరంతరం పార్టీ కార్యవర్గ సభ్యులు ప్రజలతో మమేకమైతే సత్ఫలితాలు సాధ్యమవుతాయని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. పరిశీలకులు లొడగల కృష్ణ, రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ భీమాబత్తుల సత్యనారాయణ, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావనిలు కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, మండల టీడీపీ అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, చొక్కా అప్పారావు తదితరులు ఉన్నారు.

కత్తిపూడి-శంఖవరం రహదారికి నిధులు మంజూరు

శంఖవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషితో నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధిలో ముందంజలో ఉందని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్ పేర్కొన్నారు. ఆదివారం సురేష్ నివాసంలో టీడీపీ నేతలు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ కత్తిపూడి నుంచి శంఖవరం వరకూ రహదారి అభివృద్ధికి రూ.98లక్షలు మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బద్ది మణిరామారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు, తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్, టీఎస్ఎన్ఎఫ్ కార్యదర్శి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు గాబు కృష్ణ, బొర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ పాదయాత్రకు స్వాగతం



లక్ష్మీరమణకు భగవద్గీత పుస్తకం అందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి గత ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావాలని సింహాచలం లక్ష్మీనరసింహ స్వామిని పాదయాత్రగా వచ్చి దర్శించుకుంటానని మొక్కుకున్నారు. ఈసందర్భంగా ఆమె ద్వారకాతిరుమల నుంచి సింహాచలంకు పాదయాత్ర ప్రారంభించారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారునకు చేరుకున్న ఆమెను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వాగతం పలికి పాదయాత్ర విషయాలు అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర బృందానికి భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి, మోహన్‌సాయికృష్ణ రెసిడెన్సీలో అన్ని ఏర్పాట్లుచేశారు. అనంతరం లక్ష్మీరమణికి ఎమ్మెల్యే నెహ్రూ భగవద్గీత అందించారు. సింహాచలం వెళ్లే వరకు అన్నిఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరావు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు ఉన్నారు.

వ్యాపార, వాణిజ్య సముదాయాల అభివృద్ధికి దోహదం

● ఎమ్మెల్యే సత్యప్రభ



ఎమ్మెల్యే సత్యప్రభను సత్కరిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): వ్యాపార వాణిజ్య భవన సముదాయాలు ఎంతో దోహదపడతాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పొట్టి శ్రీనివాసరావు నూతనంగా నిర్మించిన వ్యాపార వాణిజ్య భవన సముదాయాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్మించుకునేందుకు భవన సముదాయాలు ఎంతో దోహదపడతాయని అన్నా రు. అనంతరం ఎమ్మెల్యే సత్యప్రభను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, కూటమి నాయకులు యాళ్ళవిశ్వేశ్వరరావు, రావూరి తాతాజీ, చలంకూరి భాను, మూరా వరప్రసాద్, మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను, పిరాట్ల ఉమాకృష్ణమూర్తి, వైద్యులు చందన, విజయ్, ఒమ్మంగి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, పోతుల దుర్గబాబు పాల్గొన్నారు.

'సత్యదేవ విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పడాలి'



ప్రసంగిస్తున్న ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యదేవ విద్యాసంస్థలైన సంస్కృత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులు తోడ్పాటు అందించాలని విద్యాసంస్థల కరస్పాండెంట్, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1955-56లో 10మంది విద్యార్థులతో ప్రారంభమైన సత్యదేవ ఉన్నత పాఠశాల కాలక్రమంలో సంస్కృతోన్నత పాఠశాలగా మారి ఎందరినో ఉన్నత శిఖరాలకు చేర్చిందని అనంతరం జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థుల మౌళికవసతుల కల్పన, విద్యాసంస్థలలో తీసుకురావాల్సిన మార్పులు తదితర అంశాలపై పూర్వవిద్యార్థులు తమ సూచనలు, సహాయసహకారాలు అందించాలన్నారు. పూర్వవిద్యార్థి, గ్రామసర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా మాట్లాడుతూ పూర్వవిద్యార్థులందరినీ ఒకేచోటకు తీసుకురావాలనే ఆలోచన వచ్చిన ఈవో, చైర్మన్‌లను అభినందించాలని మొదటిపిలుపుకే పూర్వవిద్యార్థులు అధికసంఖ్యలో హాజరుకావడం తమను ఈ స్థాయికి తీసుకొచ్చిన విద్యాసంస్థలలో ఒకేసారి ఇంతమంది కలవడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా సత్యదేవుడి ప్రచారరథం ఊరేగింపుతో పూర్వవిద్యార్థులతో కలసి దేవస్థానం హైస్కూల్ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈసమావేశంలో డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్స్ రామ్మోహనరావు, వెంకట్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, విద్యాసంస్థలలో చదివి సత్యదేవుడి సన్నిధిలో ఉద్యోగాలు పొంది పదవీ విరమణ చేసిన ఉద్యోగు లు, ప్రస్తుత ఉద్యోగులు, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

● ప్రత్తిపాడు, గండేపల్లి, జగ్గంపేటలో పోలీసుల సైకిల్ ర్యాలీ

ప్రత్తిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పోలీసుల సైకిల్ ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర డీజీపీ గుప్తా, ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు డ్రగ్స్ వద్దు బ్రో..సైకిల్ తొక్కు బ్రో నినాదంతో ఆదివారం ఉదయం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌వద్ద ఈ ర్యాలీని సీఐ బి. సూర్యఅప్పారావు ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న యువత, విద్యార్థులు, పోలీసులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. యువత, విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌వల్ల కలిగే నష్టాలు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శారీరక పటుత్వానికి చక్కటి వ్యాయామం సైకలింగ్ అని తెలిపారు. ఎస్ఐ లక్ష్మీకాంతం డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ఈగల్ నేతృత్వంలో అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): గండేపల్లి పోలీసులు ఆదివారం డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో అంటూ ర్యాలీ నిర్వహించారు. గండేపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి సింగరంపాలెం రోడ్డు ప్రభుత్వ ఆసుపత్రి వరకు సైకిల్ తొక్కుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ యూవీ శివనాగబాబు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972 లేదా 112, 8977781972కు సమాచారం అంది ంచాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో నాలుగు పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలతోపాటు సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు, యువత ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత నిలబడాలని పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రత్తిపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ అప్పారావు



గండేపల్లిలో సైకిల్ ర్యాలీకి సిద్ధమవుతున్న పోలీసులు



జగ్గంపేటలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఎస్ఐలు

లోవకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మతల్లి

తునిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారింది. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా రూ.5.30లక్షల ఆదాయం సమ కూరినట్లు ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్ద నున్న టేకు రథంపై ఆసీనులు గావించి ప్రత్యేక పూజలనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నేడు గీతా జయంతి

తొండంగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏ కొత్తపల్లి కదంబ క్షేత్రంలో సోమవారం గీతాజయంతి వేడుకలు ఘన ంగా జరగనున్నాయని క్షేత్ర నిర్వాహకుడు భూమానంద భారతి తెలిపారు. ఉదయం గీతాచార్యునికి, గీతామాతకు పూజ అనంతరం గీతా పారాయణ జరుగుతుందని భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని తరించాలన్నారు.

'మల్లంపేటలో వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి కృషి చేస్తా'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సినీనటుడు కార్తికేయ

రౌతులపూడి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మల్లంపేట గ్రామంలో వెంకటేశ్వరస్వామిగుడి నిర్మాణ నిధులు మంజూరుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వరుపు ల సత్యప్రభ అన్నారు. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి వారసుడు సినీహీరో రెడ్డి కార్తీకేయ గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి నిధులు మంజూరచేయాలని వినతిపత్రం అందజేశారు. నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి డైరెక్టర్ రెడ్డి చిన్నయ్యనాయుడు, తాతబాబు, శీరంరెడ్డి నవీన్, ప్రసాద్ పాల్గొన్నారు.

బావాజీపేటను నూతన పంచాయతీగా ఏర్పాటుచేయాలి

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బావాజీపేట గ్రామస్థులు

జగ్గంపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక శివకేశవ ఆలయంవద్ద జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూను వెదురుపాక, బావాజీపేట అఖిలపక్ష నాయకులు కలిసి బావాజీపేటను నూతన పంచాయతీ ఏర్పాటుచేయాలని వినతిపత్రం అందజే శారు. ఎమ్మెల్యే స్పందించి జిల్లా పంచాయతీ అధికారులతో మాట్లాడి చర్చించారు. వారు పంచాయతీలు విభజించే ప్రక్రియ ప్రారంభమైందని కాబట్టి ఈ పంచాయతీని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యేకి తెలియజేయడంతో వెంటనే ఎమ్మెల్యే అఖిలపక్ష నాయకులను గ్రామసభ ఏర్పాటుచేసి తీర్మానం చేసి ఇవ్వాల న్నారు. దాంతో నా లెటర్ పెట్టి పంచాయతీని విభజించే ప్ర క్రియ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల టీడీపీ అధ్యక్షుడు పిల్లా చంటిబాబు, అఖిలపక్ష నాయకులు ఎస్.బాబు, బొట్ట రామకృష్ణ, కొత్తలవీర అప్పారావు, గొర్రెల శ్రీను, వెదురుపాక సర్పంచ్ దాసరి నాగవిష్ణు, సలాది సత్యనారాయణ, తదితర అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు ఇందూదేవికి 2025 నేషనల్ టీచర్ ఇన్‌స్పైరేషన్ అవార్డు



హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు ఇందూదేవి

కోటనందూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): వినూత్నంగా విద్యా బోధనలు చేస్తూ రాష్ట్రస్థాయిలో శిక్షణలు ఇస్తూ విద్యార్థులకు చక్కని బోధనలు అందిస్తున్న కోటనందూరు మండలం ఎస్ఆర్‌పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పొలమరశెట్టి ఇందూదేవికి హైదరాబాద్ శారదా ఎడ్యుకేషనల్‌సొసైటీ నిర్వహించిన ఇంటర్నేషనల్ టీచర్స్ డే సెలబ్రేషన్స్ అవార్డులో భాగంగా 2025 నేషనల్ టీచర్ ఇన్‌స్పైరేషన్ అవార్డుకు ఎంపికైంది. అవార్డును హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ సంస్థ చైర్మన్ పట్నం కమలమనోహర్, ఎమ్మెల్సీ శ్రావణ్ నుంచి అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా అమెకు అవార్డు రావడంపట్ల ఎంఈవోలు శ్రీనివాస్,శేఖర్, సీఆర్పీ శేఖర్ తదితరులు అభినందించారు.